
ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి శుభశ్రీ రాయగురు, మోడల్స్

ఆకట్టుకున్న సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. గురువారం ఈ ఎగ్జిబిషన్‌ను నటి శుభశ్రీ రాయగురుతోపాటు పలువురు మోడల్స్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాఖీ పండుగతోపాటు తీజ్ పండుగ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక కలెక్షన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన పేరుగాంచిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో షెడ్ ప్రారంభం


షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్ 2లోని నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం 7 లక్షల రూపాయలతో దాతల సహకారంతో నిర్మించిన షెడ్‌ను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్ ముదిరాజ్, నాయినేని చంద్రకాంత్‌రావు, ప్రసాద్, జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశీనాద్ యాదవ్, కృష్ణారావు ,దాతలు కౌశల్, సంతోష్, వీర రాఘవయ్య, మల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కనకరాజు, గోవర్ధన్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రాయదుర్గం: రాయదుర్గంలో వైభవ మహాలక్ష్మీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ముగిశాయి. ఆలయంలో గురువారం మూల నక్షత్రం శుభ ముహూర్తాన వైభవ మహాలక్ష్మీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దు...


ట్రాన్స్‌జెండర్స్‌తో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ట్రాన్స్‌జెండర్లు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి సూచించారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో గత కొంతకాలంగా ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు ,ఇతర రహదారుల పక్కన ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పటాన్‌చెరు పోలీసుల దృష్టికి రావడంతో బుధవారం రాత్రి పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్‌రెడ్డి వారికి అవగాహన కల్పించారు. సమాజంలో మంచి నడవడికతో గుర్తింపు తెచ్చుకునేలా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



రాయదుర్గం: మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ బృందం ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు వంగవీటి వంశీకృష్ణ, కార్యదర్శి తల్లాడ యశ్వంత్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ కలగార్ల నిరీష, కోశాధికారి శిరీష, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్‌సురేష్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, నాయకుడు ఈశ్వర్, క్లబ్ కార్యవర్గసభ్యులు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సేవ్ బంగ్లాదేశ్ హిందూస్' ర్యాలీ


టెలికామ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

రాయదుర్గం: బంగ్లాదేశ్‌లో 'సేవ్ హిందూస్, సేవ్ హ్యుమానిటీస్' అంటూ టెలికామ్‌నగర్‌లో గురువారం స్థానికులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. భారతీయులపై దాడులు చేయడం అందరూ ఖండించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, దినేష్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, సుభాష్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, కోమల్, కాలనీవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి తదితరులు



జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ కార్యాలయంలో బెలూన్లను ఎగురవేస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి తదితరులు



గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


గచ్చిబౌలి డివిజన్‌లో.. మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు


టీహబ్‌లో.. సీఈఓ శ్రీనివాస్‌రావుతో అధికారులు, ఉద్యోగులు, స్టార్టప్ నిర్వాహకులు, సిబ్బంది


గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో.. డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

శేరిలింగంపల్లి జోన్‌బృందం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హాఫీజ్‌పేట్, మాదాపూర్‌లలోని కాలనీలు, బస్తీలలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, శిల్పారామం, సైబరాబాద్ కమిషనరేట్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ,పోలీస్‌స్టేషన్లలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఆయా రాజకీయ పార్టీలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో జెండాలు ఎగురవేశారు .చిన్నారులకు స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు. అలాగే శిల్పారామంలో జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.


కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో..


హాఫీజ్‌పేట్ డివిజన్‌లో.. కార్పొరేటర్ పూజితాగౌడ్, నాయకులు, చిన్నారులు


శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు


పటాన్‌చెరులో.. జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు


గచ్చిబౌలిలోని నిథమ్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్, నిథమ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఈలా త్రిపాఠి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది


కొండాపూర్ డివిజన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కార్పొరేటర్ హమీద్‌పటేల్


మసీదుబండలో.. మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు


'మనూ'లో మాట్లాడుతున్న వీసీ ఐనుల్ హసన్


హెచ్‌సీయూలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ బీజేరావు


మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ..


భెల్ టౌన్‌షిప్‌లో.. గౌరవ వందనం స్వీకరిస్తున్న భెల్ ఈడీ కే.బి.రాజా

'హైడ్రా' కొరడా

- ఎర్రకుంట పరిసరాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- హైడ్రా కమిషనర్ పరిశీలించిన 24 గంటల్లోనే కూల్చివేతలు
- అక్రమ నిర్మాణాలకు టీఎస్‌బీపాస్ అనుమతులు

నిజాంపేట్: చెరువుల పరిరక్షణపై దృష్టి సారించిన హైడ్రా ఫిర్యాదులు అందిన వెంటనే ఆక్రమణ నిజమని తేలితే చర్యలు ప్రారంభిస్తోంది. బాచుపల్లిలోని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఈ నెల 1న వచ్చిన ఫిర్యాదుతో స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ నెల 14న ఎర్రకుంటను పరిశీలించారు. 15న తెల్లవారు జామునే కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. బాచుపల్లిలోని సర్వే నెంబర్ 134లో సుమారు 3.03 ఎకరాల్లో ఎర్రకుంట విస్తరించి ఉంది. అయితే ఈ చెరువు పరిసర ప్రాంతాల్లో 30 ఏళ్ల క్రితం లేవుట్ చేసి ప్లాట్‌లుగా చేసి విక్రయించారు. అయితే ఇక్కడ ఈ లేఅవుట్‌లోని సర్వే నెంబర్ 48,49 తో ఉన్న పత్రాలతో ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ గత కొంత కాలంగా జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 1న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన కమిషనర్ బుధవారం కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎర్రకుంటను సందర్శించారు. సంబంధిత అధికారులతో పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు మూడు అపార్ట్‌మెంట్‌లను కూల్చి వేశారు. ఐదంతస్తుల భవనాలను భారీ జంబో క్రేన్‌లతో నేలమట్టం చేశారు. సాయంత్రం వరకు రెండు భవనాలు పూర్తిగా నేలమట్టం కాగా మరో భవనం కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి.


భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

విరబూసిన బ్రహ్మకమలం

నిజాంపేట్: బాచుపల్లి ఇంద్రానగర్‌లోని రామ్మోహన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం బ్రహ్మకమలం విరబూసింది.. పుష్కర కాలానికి ఒకసారి మాత్రమే పూసే బ్రహ్మ కమలాన్ని చూసేందుకు పరిసర ప్రాంతవాసులు రామ్మోహన్ రెడ్డి ఇంటికి క్యూ కట్టారు.



బేబి పాండ్.. శంకుస్థాపనతో సరి...!

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేకంగా బేబి పాండ్ నిర్మించాలని నిర్ణయించారు. ఎన్నికల ముందు సుమారు రూ.34.50 లక్షల నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. కానీ ఇప్పటి వరకు పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి. నిధులు ఉన్నా పనుల్లో జాప్యం నెలకొంది. వినాయక చవితి, బతుకమ్మ పండుగలు వస్తే అధికారుల హడావుడి మామూలుగా ఉండదు.కాగా చుట్టుపక్కల కాలనీలవాసులు చెత్త చెదారం తెచ్చి కోనేరు నిర్మించే ప్రాంతంలోనే వేస్తున్నారు. ఒక వైపు ఈర్ల చెరువులో మురుగునీరు, మరోవైపు చెత్త చెదారంతో నిండిపోతుంది. చెరువు చుట్టు గ్రిల్స్‌తో ప్రహరీ నిర్మించాలి. ఈ ప్రాంతంలో చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలి. చెత్త చెదారం వేయకుండా ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలి.


హఫీజ్‌పేట్ ఈర్ల చెరువు ముఖద్వారం


ఈర్ల చెరువు వద్ద బేబి పాండ్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం



కోనేరు నిర్మించాల్సిన చోట మురుగు, చెత్త చెదారం


పనులు వెంటనే ప్రారంభించాలి



బతుకమ్మల నిమజ్జన కోనేరు పనులు వెంటనే చేపట్టాలి. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా అభివృద్ధి పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అన్ని హంగులతో కోనేరును నిర్మించాలి.

– కృష్ణ, మదీనాగూడ

మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి



చెరువులో మురుగునీరు కలవకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. శుభ్రతపై జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. పండగల సమయంలో హడావిడి చేయకుండా మిగతా రోజులలో కూడా కోనేరును శుభ్రం చేసే విధంగా చూడాలి.

–శేఖర్, హఫీజ్‌పేట్

పాత కస్టమర్ పేరిట రూ.లక్ష కాజేశారు

వెంగళరావునగర్: పాత క్లయింట్ పేరుతో ఫోన్ చేసి న్యూమరాలజిస్ట్ నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌లో నివాసం ఉండే అప్పారావు సంఖ్యాశాస్త్రం చెబుతుంటాడు. ఈ నెల 6వ తేదీన అమెరికాలో నివసించే దేవిరెడ్డి కార్తికేయ అనే తన పాత క్లయింట్ పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తనకు అర్జంటుగా రూ.50 వేలు కావాలని అడిగాడు. దాంతో అప్పారావు వాటిని పంపాడు. మరో గంటలో ఇంకో రూ.50 వేలు పంపాలని కోరగా వాటిని కూడా పంపించాడు. 8వ తేదీ మరోసారి నగదు పంపాలని అడగటంతో అప్పారావుకు అనుమానం వచ్చి అది సైబర్ మోసమని గ్రహించాడు. దాంతో బాధితుడు ఎన్‌సీఆర్‌పీకి తెలియజేసి గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.